01-09-2020 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

" మధురమైన పిల్లలూ - మీకు కర్మ-అకర్మ-వికర్మల గుహ్యగతిని వినిపించేందుకు తండ్రి వచ్చారు. ఆత్మ, శరీరము రెండూ పవిత్రమైనప్పుడు కర్మలు అకర్మలుగా అవుతాయి, పతితమైనందున వికర్మలవుతాయి "

ప్రశ్న :- ఆత్మ పై త్రుప్పు ఏర్పడేందుకు కారణమేమి? త్రుప్పు ఏర్పడి ఉంటే దాని గుర్తులేమిటి?

జవాబు :- తుప్పు ఏర్పడేందుకు కారణము - వికారాలు. పతితమైనందువల్లనే త్రుప్పు ఏర్పడ్తుంది. ఇప్పటివరకు త్రుప్పు పట్టి ఉంటే వారికి పాత ప్రపంచంపై ఆకర్షణ కలుగుతూ ఉంటుంది. బుద్ధి వికారాల పైకి పోతూ ఉంటుంది, స్మృతిలో ఉండలేరు.



ధారణ కొరకు ముఖ్య సారము:

1. యోగాగ్నితో వికారాల తుప్పును వదిలించుకోవాలి. బుద్ధి వికారాల వైపు వెళ్ళడం లేదు కదా! అని స్వయాన్ని చెక్ చేసుకోవాలి.
2. నిశ్చయబుద్ధి గలవారిగా అయిన తర్వాత మళ్ళీ ఏ విషయములోనూ సంశయం రాకూడదు. వికారాల నుండి తప్పించుకునేందుకు ఏ పని చేసినా స్వధర్మములో స్థితమై తండ్రి స్మృతిలో చేయాలి.

వరదానము :- " సర్వ ప్రాప్తుల అనుభవం ద్వారా శక్తిశాలిగా అయ్యే సదా సఫలతామూర్త్ భవ "

ఎవరైతే సర్వ ప్రాప్తుల అనుభవీమూర్తులుగా ఉంటారో, వారే శక్తిశాలురు. ఇటువంటి శక్తిశాలురు, సర్వ ప్రాప్తుల అనుభవీ మూర్తులే సఫలతా మూర్తులుగా అవ్వగలరు ఎందుకంటే ఇప్పుడు సుఖ-శాంతులనిచ్చే మాస్టర్ దాతలు ఎక్కడ ఉన్నారని ఆత్మలందరు వెతుకుతారు. కనుక మీ వద్ద సర్వ శక్తుల స్టాకు ఉన్నప్పుడే అందరినీ తృప్తిపరచగలరు.

ఎలాగైతే ఈ రోజులలో ఒకే స్టోరు నుండి అన్ని వస్తువులు లభిస్తాయో అలా మీరు కూడా తయారవ్వాలి. మా వద్ద సహనశక్తి ఉంది, ఎదుర్కునే శక్తి లేదని అనరాదు. సర్వశక్తుల స్టాకు ఉండాలి. అప్పుడే సఫలతామూర్తులుగా అవ్వగలరు.

స్లోగన్ :- " మర్యాదలే బ్రాహ్మణ జీవితానికి పునాది (కదా). అడుగుపై అడుగు ఉంచడం అనగా గమ్యానికి సమీపంగా చేరడం. "



పురుషార్థము మరియు ప్రాలబ్ధములతో చేయబడిన అనాది డ్రామా మాతేశ్వరి :-

పురుషార్థము మరియు ప్రాలబ్ధము రెండు విషయాలు. పురుషార్థంతో ప్రాలబ్ధము తయారవుతుంది. ఈ అనాది సృష్టిచక్రము తిరుగుతూ ఉంటుంది. ఆది సనాతన భారతవాసులు ఎవరైతే పూజ్యులుగా ఉండేవారో వారే మళ్ళీ పూజారులుగా అయ్యారు. మళ్ళీ ఆ పూజారులే పురుషార్థం చేసి పూజ్యులుగా అవుతారు. ఈ ఎక్కడం, దిగడం గల అనాది డ్రామా ఆట తయారైన డ్రామా.

జిజ్ఞాసువు :- మాతేశ్వరీ, ఇది ఇలా తయారైన డ్రామా అయినప్పుడు మళ్ళీ పైకి ఎక్కాలంటే తమంతకు తామే ఎక్కుతారు కదా. మరి పురుషార్థము చేసినందున లాభమేముంది? ఎవరైతే ఎక్కుతారో వారే మళ్ళీ దిగుతారుకనుక ఇంత పురుషార్థము ఎందుకు చేయాలి? మాతేశ్వరీ, మీరు ఈ డ్రామా ఉన్నది ఉన్నట్లే రిపీట్ అవుతుందని చెప్తున్నారు కనుక

సర్వశక్తివంతులైన పరమాత్మ సదా ఇటువంటి ఆటను చూచి అలసిపోరా? ఉదాహరణానికి నాలుగు ఋతువులలో చల్లదనము, ఉష్ణము మొదలైన తేడాలుంటాయి కదా అలా ఈ ఆటలో తేడాలుండవా ?



మాతేశ్వరి :- ఇదే కదా ఈ డ్రామాలోని ప్రత్యేకత. ఉన్నదున్నట్లు రిపీట్ అవుతుంది. అంతే కాక ఈ డ్రామాలో మరొక ప్రత్యేకత ఉంది. అదేమంటే అది రిపీట్ అవుతున్నా నిత్య నూతనమని అనిపిస్తుంది. మొదట మాకు కూడా ఈ శిక్షణ లేదు కాని జ్ఞానము లభించినప్పుడు సెకండు తర్వాత సెకండు ఏదైతే నడుస్తూ ఉందో భలే ఉన్నదున్నట్లు కల్పక్రితము వలె జరిగినా, సాక్షిగా భావించి చూస్తే నిత్య నూతనంగా భావిస్తారు. ఇప్పుడు సుఖ-దు:ఖాలు రెండిటి పరిచయం లభించింది. అందువలన ఫెయిల్ అవ్వాల్సే ఉంటే అసలు ఎందుకు చదవాలి అని అనుకోరాదు. అలాగైతే ఒకవేళ భోజనం లభించాల్సి ఉంటే దానంతకదే లభిస్తుందని భావించి, అందుకు పురుషార్థం చేయకుండా ఉండాలి. కాని ఇంత కష్టపడి ఎందుకు సంపాదిస్తారు? ఇప్పుడు ఎక్కేకళ జరిగే సమయం వచ్చింది, అదే దేవతా వంశం స్థాపన అవుతూ ఉంది కనుక ఇప్పుడే ఆ సుఖము తీసుకోరాదు. ఉదాహరణానికి ఇప్పుడు ఎవరైనా జడ్జిగా అవ్వాలనుకుంటే అందుకు పురుషార్థము చేసినప్పుడే కదా ఆ డిగ్రీ(పదవి) లభించేది. ఒకవేళ అందులో ఫెయిల్ అయితే పడిన శ్రమ అంతా వృథా అయిపోతుంది. అయితే ఈ అవినాశి జ్ఞానంలో అలా జరగదు, ఈ అవినాశి జ్ఞానం కొంచెం కూడా వినాశనమవ్వదు. అంత పురుషార్థం చేసి దైవీ రాయల్ వంశంలో రాకున్నా, తక్కువ పురుషార్థం చేసి ఉన్నా ఆ సత్యయుగ దైవీ ప్రజలలోకి రాగలరు. అయితే పురుషార్థం తప్పకుండా చేయాలి. ఎందుకంటే పురుషార్థం ద్వారానే ప్రాలబ్ధము తయారవుతుంది. బలిహారమంతా పురుషార్థముదే అని మహిమ చేయబడింది.

ఈ ఈశ్వరీయ జ్ఞానము సర్వ మనుష్యాత్మలకు ఉపయోగపడ్తుంది

మొట్టమొదట మీరు ఒక ముఖ్యమైన పాయింటును బుద్ధిలో తప్పకుండా ఉంచుకోవాలి. ఈ మనుష్య సృష్టి అనే వృక్షానికి బీజరూపుడు పరమాత్మ అయినప్పుడు, ఆ పరమాత్మ ద్వారా ఏ జ్ఞానమైతే ప్రాప్తిస్తూ ఉందో ఆ జ్ఞానము మనుష్యాత్మలందరికి అవసరమే. ఈ జ్ఞానము తీసుకునేందుకు అన్ని ధర్మాల వారికి అధికారముంది. ఒక్కొక్క ధర్మానికి ఒక్కొక్క జ్ఞానము, ఒక్కొక్క శాస్త్రము ఉంటుంది. అలాగే ఎవరి మతము వారిదే, ఎవరి సంస్కారము వారిదే. కాని ఈ జ్ఞానము అందరికి పనికొస్తుంది. భలే వారు ఈ జ్ఞానము తీసుకోలేకపోయినా మన ధర్మము(వంశము)లోకి రాకపోయినా వారు అందరికి తండ్రి అయినందున వారితో యోగము జోడించినందున తప్పకుండాపవిత్రంగా అవుతారు. ఈ పవిత్రత కారణంగా తమ ధర్మము(సెక్షన్)లోనే పదవి తప్పకుండా పొందుతారు. ఎందుకంటే యోగాన్ని మనుష్యులందరు అంగీకరిస్తారు. చాలామంది మనుష్యులు మాకు కూడా ముక్తి కావాలని అంటారు. అయితే శిక్షల నుండి విడుదల అయి ముక్తమయ్యే శక్తి కూడా ఈ యోగం ద్వారా లభించగలదు. అచ్ఛా. ఓంశాంతి.

-: ఓంశాంతి :-